## పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

### కలెక్టర్ ప్రియాంక ఆల



భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని, ఇప్పటికే అధికారులకు శిక్షణ పూర్తి చేసి సన్నద్ధంగా ఉన్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల తెలిపారు. ఢిల్లీ నుంచి సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్ శాసనసభ ఎన్నికల నిర్వహణపై జిల్లా ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కలెక్టర్ మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 1,098 పోలింగ్ కేంద్రాల పరిధిలో 9,66,439 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వీరిలో 74,087 మంది ఓటర్లకు ఓటర్ స్లిప్పులు అందించాల్సి ఉందన్నారు. ఫెసిలిటేషన్ కేంద్రాల్లో సిబ్బంది పోస్టల్ బ్యాలెట్లు అధికారులకు వెసులుబాటు కల్పించామన్నారు. అనంతరం ఫెసిలిటేషన్ కేంద్రాల ఏర్పాటుపై బుధవారం సాయంత్రం రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు.

## బీఆర్ఎస్‌లో చేరిన పెద్దమ్మతల్లి ఆలయ డైరెక్టర్ నాగరాజు



పార్టీలో చేరిన వారితో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 22 : నియోజకవర్గంలోని పాల్వంచ మండలం పెద్దమ్మతల్లి ఆలయ డైరెక్టర్ చింతా నాగరాజు కాంగ్రెస్ పార్టీకి గుడ్‌బై చెప్పి బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. కొత్తగూడెంలోని జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సమక్షంలో ఆయన పార్టీ కండువా కప్పుకున్నారు. ఎడవల్లి కృష్ణ, కంచర్ల చంద్రశేఖర్‌రావు, దిండిగల రాజేందర్, బదావత్ శాంతి, భీమా శ్రీధర్, భూక్యా చందూనాయక్ పాల్గొన్నారు.

## ఆలిండియా పోటీలకు డిగ్రీ విద్యార్థులు



హరిప్రియను అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

పాల్వంచ రూరల్, నవంబర్ 22 : హన్మకొండలో మంగళవారం జరిగిన ఆలిండియా సౌత్‌జోన్, వెస్ట్‌జోన్ బాక్సింగ్ సెలక్షన్స్‌లో మండలంలోని లక్ష్మీదేవిపల్లి(ఎస్) కళాశాల విద్యార్థులు అర్హత సాధించారు. బీఎస్సీ రెండో సంవత్సరం చదువుతున్న పొట్టపువ్వు హరిప్రియ బాక్సింగ్ 50-52 పై వెయిట్ కేటగిరిలో అర్హత పొందగా, బీఏ మొదటి సంవత్సరం చదువుతున్న సుల్తాన్ మురారి బాక్సింగ్ 60-63 కేటగిరిలో ఎంపికయ్యాడు. వీరు త్వరలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారు. వీరిని బుధవారం కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నప్పయ్య, అధ్యాపకులు కార్తీక్, అబ్రహాం, ఎస్.రాంబాబు, విజయ్‌కుమార్ అభినందించారు.

## రామయ్య హుండీ ఆదాయం రూ.1.29 కోట్లు

భద్రాచలం, నవంబర్ 22: భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయ సన్నిధిలో బుధవారం ఆలయ ఈవో రమాదేవి పర్యవేక్షణలో సిబ్బంది హుండీ ఆదాయాన్ని లెక్కించారు. రామయ్యకు రూ.1.29 కోట్ల ఆదాయం సమకూరిందని ఈవో తెలిపారు అలాగే 101 గ్రాముల బంగారు ఆభరణాలు, కిలో వెండి ఆభరణాలు భక్తులు సమర్పించారన్నారు. దీంతో హుండీలో కొంత విదేశీ కరెన్సీ ఉందన్నారు. ఆఖరు హుండీని సెప్టెంబర్ 25న లెక్కించగా 61 రోజులకు రూ. 1.07 కోట్ల ఆదాయం సమకూరగా, ఈసారి 58 రోజులకు రూ.1.29 కోట్ల వచ్చింది.



141వ బూత్‌లో ప్రచారం నిర్వహిస్తున్న రేపాక పూర్ణచంద్రరావు



శాంతినగర్ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న దారపునేని రాంబాబు



అశోక్‌నగర్ కాలనీలో అరికెల్ల తిరుపతిరావు, నాయకుల ప్రచారం

# అభివృద్ధిని చూసి ఓటేయండి

### తెల్లం వెంకట్రావు గెలుపు కోసం బీఆర్ఎస్ శ్రేణుల ముమ్మర ప్రచారం

భద్రాచలం, నవంబర్ 22 : రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ అభ్యర్థికి ఓటేయ్యాలని ఆ పార్టీ భద్రాచలం మండల అధ్యక్షుడు అరికెల్ల తిరుపతిరావు, ఉపాధ్యక్షుడు రత్నం రమాకాంత్, రైతుబంధు సమితి మండల కన్వీనర్ దారపునేని రాంబాబు, బూత్ కమిటీ ఇన్‌చార్జిలు రేపాక పూర్ణచంద్రరావు, నర్రా రాము, చాట్ల రవికుమార్, చింతాడి చిట్టిబాబు, ఈర్ల భారతి తదితరులు పేర్కొన్నారు. బుధవారం భద్రాచలం పట్టణంలోని 41 పోలింగ్‌బూత్‌ల ఇన్‌చార్జిలు, వారి సభ్యులు బూత్‌కు 20మంది చొప్పున పట్టణంలోని వారికి కేటాయించిన బూత్‌ల్లో తిరుగుతూ బీఆర్ఎస్ భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావును గెలిపించాలని కోరారు. వైద్యుడిగా ఎన్నో వేల మంది ప్రాణాలను కాపాడిన ఆయనకు ఒక్కసారి అవకాశమివ్వాలని అభ్యర్థించారు. అశోక్‌నగర్‌కాలనీ, భూపతిరావు కాలనీలో 158,159, 160 బూత్‌ల్లో ని ప్రజలకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ మ్యానిఫెస్టోని కరపత్రాన్ని, ఈవీఎంలో అభ్యర్థి కారు గుర్తును చూపెట్టారు. ఈవీఎం నొక్కించి జై కేసీఆర్, జైజై బీఆర్ఎస్, జై తెల్లం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ దొందూ దొందేనని వారికి ఓటేస్తే మళ్లీ కరెంట్ కష్టాలు వస్తాయని తెలిపారు. అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్న బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకే ఓటేయ్యాలని, ముచ్చటగా మూడోసారి కేసీఆర్ సార్‌ను సీఎం కుర్చీలో కూర్చోపెట్టాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కార్యదర్శి కొండిశెట్టి కృష్ణమూర్తి, బొంబోతుల రాజీవ్, ఆత్మ కమిటీ చైర్మన్ లకావత్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### వెంకట్రావు సతీమణి ప్రచారం

డాక్టర్ తెల్లం వెంకట్రావు సతీమణి ప్రవీణ ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొంటున్నారు. ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుపై ఓటేసి తన భర్తను అసెంబ్లీకి పంపాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మహిళలకు బొట్టు పెడుతూ ఓట్లను అభ్యర్థించారు. కాలనీవాసులను ఆప్యాయంగా పలకరిస్తూ వారి క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకున్నారు. తమ ఇంటికి వచ్చిన ఆడపడుచును కాలనీవాసులు పూలు చల్లి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

### బీఆర్ఎస్‌తోనే భద్రాచలం అభివృద్ధి

బీఆర్ఎస్ పార్టీతోనే భద్రాచలం అభివృద్ధి ముడిపడిందని, బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావును గెలిపిస్తే భద్రాచలం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని 141 బూత్ ఇన్‌చార్జి రేపాక పూర్ణ చంద్రరావు ఇంటింటి ప్రచారంలో మాట్లాడారు. గతంలో భద్రాచలంలో తాగునీటి కోసం ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని, సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ పథకంతో ఆ బాధలు తీరిపోయాయని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తే మహిళలకు రూ.3 వేలు గౌరవ భృతి ఇస్తుందని, ప్రజలందరికీ అవసరమైన గ్యాస్ సిలెండర్‌ను కేవలం రూ.400లకే అందిస్తుందన్నారు. రేషన్‌కార్డు ఉన్నవారికి రూ.5 లక్షల జీవిత బీమా ప్రభుత్వమే అందజేస్తుందని, ప్రీమియం కూడా ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు.

### సంక్షేమ పథకాలు బీఆర్ఎస్‌కే సాధ్యం

బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తేనే సంక్షేమ పథకాలు అమలవుతాయని రైతుబంధు సమితి మండల కన్వీనర్ దారపునేని రాంబాబు, బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు నర్రా రాము అన్నారు. పట్టణంలోని శాంతినగర్, సుభాష్‌నగర్ కాలనీల్లో విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఓటర్లకు బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను వివరించారు. కారు గుర్తుకే ఓటేసి, స్థానికుడైన మంచి మనిషి, ఎంతో మందికి ప్రాణదాత డాక్టర్ తెల్లం వెంకట్రావును భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన అవసరముందన్నారు. ఉత్తుత్తి హామీలు ఇచ్చే కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలని ఓటర్లను కోరారు.

### తెల్లం వెంకట్రావును ఆశీర్వదించండి

డాక్టర్ తెల్లం వెంకట్రావును ఆశీర్వదించి అసెంబ్లీకి పంపాలని బీఆర్ఎస్ నాయకురాలు ఈర్ల భారతి అన్నారు. బుధవారం తన బూత్ పరిధిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పదేళ్లుగా ఎమ్మెల్యేలుగా ఉన్న వాళ్లు భద్రాచలం నియోజకవర్గాన్ని ఏమాత్రం అభివృద్ధి చేయలేదని, బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి ముడిపడి ఉందని తెలిపారు. ఒక్కసారి బీఆర్ఎస్‌కు ఓటేసి వెంకట్రావును గెలిపించాలని కోరారు.

### స్థానికుడైన తెల్లంను గెలిపిస్తేనే అభివృద్ధి

దుమ్ముగూడెం, నవంబర్ 22 : స్థానికుడు, గిరిజన బిడ్డ తెల్లం వెంకట్రావును భద్రాచలం నియోజకవర్గ ప్రజలు గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కె.దంతెనం గ్రామంలో ముఖ్యకార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ప్రతి కార్యకర్త బీఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గడపగడపకూ తీసుకువెళ్లి వివరించాలని సూచించారు. మ్యానిఫెస్టో అంశాలు, నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలని కోరారు. ఎన్నికల్లో తెల్లంను భారీ మెజార్టీతో గెలిపించాలని, అందుకు కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పని చేయాలన్నారు. నాయకులు దామెర్ల శ్రీనివాసరావు, శ్రీకాంత్, కార్యకర్తలు పాల్గొన్నారు.

### కృష్ణాపురంలో..

వాజేడు, నవంబర్ 22 : అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా మండలంలో బీఆర్ఎస్ నాయకులు గ్రామాల్లోకెళ్లి విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. కృష్ణాపురం పంచాయతీలోని కడెకల్ గ్రామంలో బుధవారం నూగూరు వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ వాజేడు, వెంకటాపురం మండల బీఆర్ఎస్ ఎన్నికల కన్వీనర్ బోదెబోయిన బుచ్చయ్య ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి కారు గుర్తుపై ఓటు వేసి భద్రాచలం నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావును భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రచారంలో పార్టీ మండల అధ్యక్షుడు పెనుమల్లు రామకృష్ణారెడ్డి, సర్పంచ్ పునెం నాగచంద్ర, నాయకులు దత్తాద్రి, పొట్టం భవాని, షేక్ నిజాముద్దీన్, బొడ్డు రామచంద్రయ్య, మడే కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



అశోక్‌నగర్ కాలనీలో తెల్లం సతీమణి ప్రవీణపై పూలవర్షం కురిపిస్తున్న కాలనీవాసులు



దుమ్ముగూడెం : మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అన్నెం సత్యనారాయణమూర్తి



వాజేడు : కడెకల్‌లో బీఆర్ఎస్ నాయకులు బుచ్చయ్య, రామకృష్ణారెడ్డి, కార్యకర్తలు

## ఆన్‌లైన్‌లో భద్రాద్రి రామయ్య ఉత్తర ద్వార దర్శన టికెట్లు

భద్రాచలం, నవంబర్ 22: భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి ఆలయ పరిధిలో ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా డిసెంబర్ 23న స్వామివారు ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనమివ్వనున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులు ఆన్‌లైన్‌లో దర్శన టిక్కెట్లు ఉంచారు. బుధవారం ఉదయం 11 గంటలకు ఆలయ ఈవో రమాదేవి ఆన్‌లైన్ సేవలను ప్రారంభించారు. భక్తులు bhadradritemple. telangana. gov. in అనే వెబ్‌సైట్‌లో టికెట్లు బుక్ చేసుకోవచ్చు. టిక్కెట్ల ధరలు వరుసగా రూ.2 వేలు, రూ.వెయ్యి, రూ.500, రూ.250గా ఉంటాయి. ఉత్సవాలకు రాలేని భక్తులు తమ గోత్రనామాలతో స్వామివారికి అర్చన నిర్వహించేందుకు (పరోక్ష సేవలు)కూ అధికారులు అవకాశం కల్పించారు. ఈ సేవలు రూ.2 వేలు, రూ.వెయ్యి చెల్లించాల్సి ఉంటుంది. టిక్కెట్లు బుక్ చేసుకున్న వారు వచ్చే నెల 13 నుంచి ఆలయ పరిధిలోని తానీషా కల్యాణ మండపంలోని దేవస్థానం కార్యాలయం (సీఆర్వో)లో ఒరిజినల్ టిక్కెట్లు పొందవచ్చని ఆలయ ఈవో ఎల్.రమాదేవి తెలిపారు.